నిమజ్జనానికి విఘ్నాలు

- గోదావరి గట్టు ఇసుక రేవు వద్ద వరద ఉధృతి
- వరద తగ్గాక నిమజ్జనం చేసుకోవాలంటున్న అధికారులు

సీటీఆర్‌ఐ: విఘ్నాలు తొలగించే వినాయకుడి నిమజ్జనానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ నెల 7వ తేదీన వినాయక చవితి సందర్భంగా నగరంలోని వాడవాడలా గణేష్ మంటపాలను ఏర్పాటు చేశారు. వినాయక చవితి వేడుకలను నగరంలోని ఆయా ప్రాంతాలను బట్టి మూడు రోజులు, ఐదు రోజులు, ఏడు రోజులు, తొమ్మిది రోజులు జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. అయితే బుధవారానికి ఐదు రోజులు పూర్తయిన సందర్భంగా కొందరు తమ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి పూనుకున్నారు. అయితే గోదావరి వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో వినాయక నిమజ్జనానికి మరో రెండుమూడు రోజులు ఆగాలంటూ వినాయక మంటపాలను ఏర్పాటుచేసిన కమిటీలను అధికారులు కోరుతున్నారు.

వెనక్కి పంపేస్తున్న అధికారులు

గోదావరి గట్టున ఇసుక ర్యాంపు వద్ద ఏటా గణేష్ నిమజ్జనం కార్యక్రమం జరుగుతుంది. అయితే గోదావరికి వరద ఉధృతి పెరగడంతో ఇసుక ర్యాంపు పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. దీంతో మంగళ, బుధవారాల్లో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, అగ్నిమాపక, మత్స్య శాఖల అధికారుల సహకారంతో పూర్తిగా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో నిమజ్జనాల కార్యక్రమం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. నిమజ్జన సమయంలో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన యంత్రాంగానికి విగ్రహాలు అప్పగించి సహకరించాలని కలెక్టర్ ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. గణేశ్ నిమజ్జనాలకు కొవ్వూరు డివిజన్ పరిధిలో ఎక్కువగా ఘాట్లు ఏర్పాటు చేశారు. అయితే కాని వరద ఉధృతి ఏ మాత్రం తగ్గకపోగా ఇంకా పెరగడంతో నిమజ్జనాలు సాధ్యం కాలేదు. తాజాగా గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక సైతం జారీ చేసిన నేపథ్యంలో నిమజ్జనం చేయడానికి వీలు కాదని, వరద ఉధృతి తగ్గాక నిమజ్జనం చేసుకోవాలంటూ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎవరైనా మొండిగా విగ్రహాలను గోదావరి వద్దకు తీసుకొచ్చినా అధికారులు అడ్డుకుని వెనక్కి పంపేస్తున్నారు.

చిన్న మంటపాలకి భారం

పెద్ద పెద్ద మంటపాలలో నిర్వహించే వినాయక చవితి వేడుకలు తొమ్మిది రోజులు పాటు నిర్వహిస్తారు. కాని చిన్న మంటపాల వారు మాత్రం మూడు రోజులు, ఐదు రోజుల వరకే చవితి వేడుకలకు పరిమితం అవుతారు. అలాంటి వారంతా గోదావరి ఉధృతి తగ్గేంత వరకూ గణేష్ నిమజ్జనం చేయకుండా ఆగాలంటే వారికి ఆర్థికంగా భారంగా మారుతుంది. పైగా కూటమి ప్రభుత్వ హయాంలో వినాయక విగ్రహం ఐదు అడుగులు దాటితే ఒక రుసుము, ఐదు రోజులు చేస్తే మరో ఫీజు, మైక్ సెట్‌లు వాడితే ఇంకో ధర పెట్టి భగవంతుడి కార్యక్రమాన్ని ఈవెంట్‌గా మార్చేశారు. దీంతో చిన్న మంటపంలో వినాయక చవితి నిర్వహించే ఉత్సవ కమిటీల వారు వరద ఉధృతి తగ్గే వరకూ నిమజ్జనం చేయకపోవడం వల్ల ప్రభుత్వం విధించే బాదుడు తట్టుకోలేమని ఆవేదన చెందుతున్నారు.


గోదావరి వరదతో నీట మునిగిన గణేష్ నిమజ్జన ప్రదేశం


నగరంలో కొలువుదీరిన సృష్టి గణపతి

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ బుధవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ మార్కెట్ యార్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లలితానగర్, హరిపురం, వీరభద్రాపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

కడియం: సీజనల్ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఎస్.నాగసాయిమౌర్య, ఎన్.జెస్సీ సుప్రియ అన్నారు. బుధవారం కడియం మండలంలోని కడియపుసావరంలోని వడ్డి వీరభద్రరావు కాలనీ, పొట్టిలంకలోని ఆరోగ్య ఉపకేంద్రం వద్ద వైద్య శిబిరాలు నిర్వహించారు. కడియపుసావరంలో 43 మంది రోగులను పరీక్షించగా ఇద్దరికి జ్వరం ఉన్నట్లుగా గుర్తించారు. పొట్టిలంకలో 24 మంది రోగులను పరీక్షించి జ్వరంతో ఉన్న ఇద్దరిని గుర్తించి డెంగ్యూ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆరోగ్య విస్తరణాధికారి రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం


హెచ్‌ఎం సత్యనారాయణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కడియం: జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ సేవలు ప్రశంసనీయమని పలువురు అభినందించారు. స్థానిక స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా పాఠశాలకు మౌలిక వసతులను సమకూర్చడానికి, మంచి విద్యా ఫలితాలు సాధించడానికి హెచ్‌ఎం సత్యనారాయణ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఎంసీ అధ్యక్షురాలు పి.సత్య, ఉపాధ్యాయులు కె.రాజు, రఫీయుద్దీన్, రామకృష్ణంరాజు, సువర్ణవేణి, పుష్పకుమారి, హనుమంతరావు, వెంకటదుర్గ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా వున్న ఆరు అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీ కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ నరసమ్మ బుధవారం ప్రకటించారు. మదన్‌సింగ్‌పేట, ధాన్యం పాకలు, సుబ్బారావుపేట, సంజీవనగర్, ఉల్లితోట వీధి, అన్నపూర్ణమ్మపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవొచ్చన్నారు. అభ్యర్థులు పూరించిన దరఖాస్తులను నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు అందజేయొచ్చన్నారు.

14న హెల్త్ మినిస్టర్ రాక

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఈ నెల 14వ తేదీన వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రాజమహేంద్రవరం రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటనకు సంబంధించి బుధవారం అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి సర్క్యులర్ విడుదలైంది. ఆయన రాజమహేంద్రవరం మెడికల్ కళాశాలకు విచ్చేసి అక్కడ హెచ్‌ఓడీలు, వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడతారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిని పరిశీలించనున్నారు.

పుష్కరాల రేవులో లాకర్ల ప్రారంభం



లాకర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్‌ఐ: స్థానిక పుష్కరాల రేవులో స్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం రుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 30 లాకర్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల రేవులో స్నానాలు, వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం వచ్చే భక్తులు తమ సామాన్లు భద్రపరుచుకునేందుకు లాకర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ, రుడా అధికారులు పాల్గొన్నారు.

పురావస్తు శాఖతో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల చరిత్ర, పురావస్తు శాఖ, మ్యూజియం విభాగాల ఆధ్వర్యంలో బుధవారం పరస్పర స్పందన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఈ ఒప్పందంతో పురావస్తుశాఖ మ్యూజియం విభాగం, చరిత్ర విభాగం మధ్య అవసరమైన విజ్ఞానాన్ని పంచుకోవటం, పరిశోధన కార్యకలాపాలను నిర్వహించుకోవడంలో విద్యార్థులను భాగస్వాములుగా చేసేటట్టుగా ఇరు విభాగాల మధ్య అంగీకారం కుదిరిందని చెప్పారు. ఈ రెండు శాఖల ఆధ్వర్యంలో సెమినార్ల నిర్వహణ, వివిధ రకాలైన అవగాహన కార్యకలాపాల నిర్వహణకు ఒప్పందం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల పురావస్తుశాఖ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ కె.తిమ్మరాజు, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ యు.రాజేశ్వరి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కేఏఏ అన్నపూర్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్డినేటర్ డాక్టర్ కేఎస్ శ్రీరామమూర్తి, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ బి.అంజనీకుమారి, పి.తులసీకుమారి, కె.వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.


పురావస్తుశాఖ, మ్యూజియం విభాగాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు


అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులతో గురుకులం ప్రిన్సిపాల్ గుర్రయ్య, ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల యంగ్ ఇన్వాయిస్ ఇంటర్నేషనల్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ప్రాగ్రెస్ ఆఫ్ ఆర్ట్ బడ్స్–2024 పేరుతో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు బంగారు, 29 మంది విద్యార్థులు జ్యూరీ అవార్డులను గెలుచుకుని సత్తా చాటారని రాజమహేంద్రవరం శ్రీసత్య సాయి గురుకులం ప్రిన్సిపల్ కె.గుర్రయ్య ఎ.శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటుచేసి విజేతలైన విద్యార్థులను సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ గుర్రయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు చిత్రలేఖనంలోనూ తర్ఫీదునిస్తున్నామన్నారు. కరస్పాండెంట్ శ్యాంసుందర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో భారత్‌తో పాటు హంగేరి, రొమేనియా, బల్గేరియా, సెర్బియా తదితర దేశాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పెద్ద ఎత్తున పోటీ ఉన్నా తమ విద్యార్థులు సత్తా చాటి అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం చిత్రలేఖనం ఉపాధ్యాయులు మోటూరి శ్రీ, శివాజీలను అభినందించారు.

వరద బాధితులకు వితరణ


వరద బాధితులకు తరలించిన చీరలు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ వరద బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం తరఫున తుమ్మిడి అరుణ్‌కుమార్ సహకారంతో రూ.1,50,000 విలువ గల 500 చీరలను బుధవారం విజయవాడకు తరలించినట్లు క్లబ్ అధ్యక్షుడు శ్రీరామ్‌గుప్తా తెలిపారు. వరద బాధిత మహిళలకు చీరల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కుమారస్వామి, ట్రెజరర్ రాఘవరావు, క్లబ్ అడ్మిన్ గ్రంధి లక్ష్మీ వసంతకుమారి, గ్రంధి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విరాళం చెక్కును ఎమ్మెల్యే గోరంట్లకు అందజేస్తున్న పల్లా సోదరులు

పల్లా వెంకన్న ట్రస్టు రూ.3 లక్షల విరాళం

కడియం: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పల్లా వెంకన్న చారిటబుల్ ట్రస్టు తరఫున రూ.3 లక్షల విరాళాన్ని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి ట్రస్ట్ ప్రతినిధులు పల్లా సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతిలు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, బొరుసు సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు. వరద బాధితులకు కడియం నర్సరీ రైతులు రూ.4 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి బుధవారం ఆయన కార్యాలయంలో అందజేశారు.

పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

కడియం: పోషకాహారంతోనే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోగలుగుతామని జేగురుపాడు సర్పంచ్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. పోషకాహార మాసోత్సవాలు జేగురుపాడులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్టాలిన్ మాట్లాడుతూ జేగురుపాడు గ్రామంలో ఉన్న 40 మంది చిన్నారుల్లో ఏ ఒక్కరూ బరువు తక్కువగా లేరన్నారు. దీన్నిబట్టి గర్భిణులు, చిన్నారులు, బాలింతల ఆరోగ్యంపై స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది ఎంత శ్రద్ధ వహిస్తున్నారో అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ కనకవల్లి, మాజీ ఎంపీటీసీలు నాగిరెడ్డి శివాజీ, పాలపర్తి ప్రకాష్‌కుమార్, పుట్ట బుజ్జి, బల్ల అన్నవరం పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ధవళేశ్వరం: ప్రతిఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని రాజానగరం ప్రాజెక్టు అధికారి టి.నాగమణి సూచించారు. బుధవారం ధవళేశ్వరం ఎర్రకొండ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి తక్కువ ఖర్చుతో తీసుకోగల ఎక్కువ పోషకాలున్న ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, వెల్ బేబీ షో నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ యు.శిరీష, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


పోషకాహార మాసోత్సవాల్లో మాట్లాడుతున్న సర్పంచ్ స్టాలిన్

రక్తదానమంటే ప్రాణదానంతో సమానం

రాజమహేంద్రవరం రూరల్: రక్తదానమంటే ప్రాణదానంతో సమానమని, రక్తం అనేది డబ్బుతో కొనలేనిదని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా 'తిరుమల చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో సంస్థ ప్రాంగణంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డా.వైఎస్సార్ అండ్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 210 మంది తిరుమల సిబ్బంది రక్తదానం చేశారని తిరుమలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరికొందరి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఒక వ్యక్తి తన జీవితకాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, నున్న కృష్ణ, నున్న సురేష్, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న తిరుమల చైర్మన్ నున్న తిరుమలరావు

సుప్రీంకోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలి

సీటీఆర్‌ఐ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని దళిత నాయకులు అన్నారు. గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ ఆపేంతవరకు తాము ఉద్యమిస్తూ ఉంటామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా గోకవరం బస్టాండ్ వద్ద నుంచి బొమ్మూరు కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్లి కలెక్టర్ పి.ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు, ఇసుకపట్ల రాంబాబు, మర్రి బాబ్జి, రాజేంద్ర ప్రసాద్, నక్కా వెంకట రత్నరాజు, జార్జి ఆంటోని తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దళిత నాయకులు


ఐఎస్‌టీఎస్‌లో 'ఉరుకు పటేల' బృందం సందడి


విద్యార్థులతో కరచాలనం చేస్తున్న హీరో తేజస్

రాజానగరం: తూర్పుగానుగూడెం, ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఉరుకు పటేల చిత్ర బృందం హల్‌చల్ చేసింది. ఈనెల 7వ తేదీన విడుదలైన ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందుతున్న నేపథ్యంలో విజయోత్సవ యాత్ర చేస్తూ బుధవారం సాయంత్రం కళాశాలను సందర్శించి, విద్యార్థులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. లవ్, కామెడీ, థ్రిల్లర్ అంశాలతో అందరినీ అలరిస్తున్న ఈ సినిమాను ప్రతి ఒక్కరూ థియేటర్‌లోనే చూడాలని హీరో తేజస్ విజ్ఞప్తి చేశారు. తన మొదటి సినిమాను హిట్ చేసిన అభిమానులకు హీరోయిన్ కుష్బూచౌదరి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సినిమాలోని డైలాగ్స్, సాంగ్స్‌తో విద్యార్థులతో కలిసి కొద్దిసేపు సందడి చేశారు.

స్వామి వివేకానంద ఉపన్యాసానికి 131 ఏళ్లు

సీటీఆర్‌ఐ: స్వామి వివేకానంద 1893 సంవత్సరం సెప్టెంబర్ 11న చికాగో నగరంలో విశ్వమత మహాసభలో చారిత్రాత్మక ఉపన్యాసం ఇచ్చి బుధవారంతో 131 ఏళ్లు అయ్యిందని స్వామి శశికాంతానందజీ మహారాజ్ అన్నారు. స్థానిక కంబాలచెరువు వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శారదాదేవి స్కాలర్‌షిప్ టెస్ట్ విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు, వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ 36వ బ్యాచ్ విద్యార్థులకు కోర్సు సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో స్వామీజీలు పరిజ్ఞేయానందజీ, వేదవిద్యానందజీ, రఘువీరానందజీ, డాక్టర్ గోలి రామారావు తదితరులు పాల్గొన్నారు.


స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్వామీజీలు

ఖరీఫ్ దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వెంకట నరసింహారావు, శ్రీనివాస్
- మండలంలో వరి, అపరాల సాగు పరిశీలన

రంగంపేట: ప్రస్తుత ఖరీఫ్ సాగులో పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట, చంద్రేడు గ్రామాల్లోని వరి, అపరాల పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావుతో కలిసి బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి, అపరాల పంటలలో చీడ పీడలు సాధారణ స్థాయి కన్నా తక్కువగా ఉన్నాయన్నారు. వరి ప్రస్తుతం ఈనిక దశలో ఉందని, పంట ఆరోగ్యంగా ఉందన్నారు. అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో మాగుడు తెగులు కనిపించిందని, దీని ఉధృతి పెరగకుండా నివారణకు హెక్సాకోనాజోల్ 2.0 మిల్లీలీటర్లు లేదా ప్రోపికోనాజోల్ 1.0 మిల్లీలీటర్లు లేదా 0.4 గ్రాముల ట్రిప్లాక్సీస్ట్రోబిన్, టెబ్యూకోనాజోల్ 1.5 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో పిచికారీ చేయాలన్నారు. అక్కడక్కడా కనిపిస్తున్న ఆకుముడత ఉధృతి పైరు పెరిగే కొద్దీ ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున నివారణకు 2.0 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. స్వర్ణ ఎంటీయూ 1318 వంటి రకాలకు నత్రజని ఎరువును తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. బీపీటీ 5204 లాంటి సన్న రకాలలో తెగులు ఉధృతి కనిపించే అవకాశం ఉన్నందున పైన సూచించిన మందులను పిచికారీ చేయాలన్నారు. మినుము పంటలో చిత్త పురుగులు, కాండం ఈగ నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎస్.జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి కూరాకుల శ్రీనివాసరావు, వీఏఏ మహేష్, రైతులు పాల్గొన్నారు.


చంద్రేడులో పంటలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

రుడా ఇన్‌చార్జ్ వైస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ


కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక రుడా కార్యాలయంలో రుడా ఇన్‌చార్జ్ వైస్ చైర్మన్‌గా నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుడా పరిధిలో వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయటానికి చర్యలు తీసుకుంటూ, పరిపాలన పారదర్శకంగా ఉండేలా చూస్తానన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టండి


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: అధిక వర్షాల కారణంగా నగరంలో దెబ్బతిన్న బీటీ రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలో దిశ పోలీస్‌స్టేషన్ రోడ్డు, జాగృతి బ్లడ్ బ్యాంక్ నుంచి షెల్టన్ వరకూ రోడ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆర్యాపురం ఎస్‌ఆర్‌సీపీ నుంచి ఎస్‌టీపీకు వెళ్లే మురుగునీటి పైప్‌లైన్ లీకేజీను పరిశీలించి త్వరగా మరమ్మతులు చెయ్యాలని ఆదేశించారు. పర్యటనలో ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ పాండు రంగారావు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గరిక పూజ

కడియం: మండలంలోని బుర్రిలంకలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో 56వ గణపతి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి గరిక పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో భాగవతుల వేణుశర్మ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 21న మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. మండలంలోని కడియపులంకలోని ముసలమ్మవారి ఆలయం వద్ద విద్యాలక్ష్మి గణపతి స్వామివారి నవరాత్రుల్లో భాగంగా బుధవారం రాత్రి సరస్వతీ పూజలు నిర్వహించారు.


వరకట్న వేధింపుల కేసులో శిక్ష ఖరారు

కడియం: వరకట్న వేధింపుల కేసులో ఓ నిందితుడికి శిక్ష పడిందని కడియం ఎస్ఐ ఎ.వేంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2016లో మాధవరాయుడుపాలేనికి చెందిన అడపా నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు ఆమె భర్త అడపా నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులపై అప్పటి ఎస్ఐ కె.సురేష్‌బాబు 498ఏ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. ఈ కేసులో రాజమహేంద్రవరం 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు బుధవారం తీర్పు వెల్లడిస్తూ నిందితుడు నాగేశ్వరరావుకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధించారన్నారు. ఏపీపీగా ఓలేటి మహాలక్ష్మి వాదించారని చెప్పారు.

పెయ్యదూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పెయ్యదూడల పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. బుధవారం కాతేరు గ్రామ సచివాలయం–1 వద్ద రాష్ట్రీయ గోకులమిషన్, జిల్లా పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి నిర్ధారణ చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెయ్యదూడలు మాత్రమే జన్మించడానికి ప్రత్యేక ఇంజెక్షన్‌ను పాడి రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. పశువుల షెడ్లు నిర్మించుకోవడానికి 90 శాతం రాయితీపై మినీ గోకులం పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, కడియం అసిస్టెంట్ డైరెక్టర్ డా.రవివర్మ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	35 చిన్నకథకాదు
సూర్యమినీ	35 చిన్నకథకాదు
సూర్యప్యాలెస్	సరిపోదా శనివారం
స్వామి	సరిపోదా శనివారం
అశోక	ఆయ్
శివజ్యోతి	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
అనుశ్రీ	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
రాజా	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
రంభ	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం, ఉరుకు పటేలా.
ఊర్వశి	కమిటీ కుర్రోళ్లు
మేనక	తంగలాన్
కుమారి	సరిపోదా శనివారం
అప్సర	సరిపోదా శనివారం
నామవరం	
వీఎస్ మహల్	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
కడియం	
వెంకటసూర్య	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)